క్లుప్తంగా

మండలాభివృద్ధికి కృషి చేయండి



పంచాయతీల పురోగతి సూచికపై శిక్షణ ఇస్తున్న ట్రైనర్

సి.బెళగల్: గ్రామాల్లో పనిచేసే ఉద్యోగులు, అధికారులు మండల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ బొంతల మునెప్ప అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా శాఖల మండల అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, ప్రజాప్రతినిధులకు ఎంపీడీఓ రాణెమ్మ అధ్యక్షతన పంచాయతీల పురోగతిపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గ్రామాలలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారాలపై సూచనలు చేశారు. ఆయా గ్రామాలలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేస్తూ, మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు గోసేనాయక్, వెంకటప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

పాణ్యం : విద్యార్థులు కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం కళాశాలలో ఈఈఈ విభాగ విద్యార్థులకు ‘టెక్ స్పీక్ -2025’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక విప్లవంలో భాగస్వాములై డిజిటల్ విభాగంలో పాలుపంచుకొని ఫలాలను అందించాలన్నారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఈఈఈ విభాగ అధిపతి వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఇంటి గోడ



కూలిన ఇంటి గోడ

పాణ్యం : మండల పరిధిలోని కొండజుటూరు గ్రామంలో అధిక వర్షాలకు తడిసిన ఓ ఇంటి గోడ బుధవారం కూలిపోయింది. గ్రామానికి చెందిన చిలకల పుల్లయ్యకు చెందిన ఇంటి మట్టి గోడ వర్షానికి పూర్తిగా తడిసిపోయింది. దీంతో గోడలోని ఓ భాగం పడిపోయింది. తర్వాత పై కప్పు నుంచి మట్టి క్రమంగా కిందపడి రాళ్లు పడ్డాయి. అయితే గోడ కూలే సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

ఇలా ఉంటే రోగాలు రావా?



అహల్యాపురం అంగన్‌వాడీ కేంద్రం ముందు నిల్వ ఉన్న మురుగునీరు

పాణ్యం: మండల పరిధిలోని అహల్యాపురం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు పక్కపక్కనే ఉన్నాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల ముందు నీరు నిల్వ ఉండి.. దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో పిల్లలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. వర్షపు నీరు వెళ్లేందుకు వీలులేకపోవడంతో పాఠశాలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లాలంటే పిల్లలు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని పిల్లకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరుతున్నారు.

అంతా ఇష్టారాజ్యం



ఉదయం 11గంటలకు సచివాలయ సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

కర్నూలు(రూరల్): సచివాలయ ఉద్యోగులు విధుల నిర్వహణలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పలువురు సమయపాలన పాటించడంలేదు. ఆలస్యంగా కార్యాలయానికి రావడం.. ముందుగానే తాళం వేసి వెళ్లిపోవడం చేస్తున్నారు. దీంతో వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చిన ప్రజలు ఉద్యోగులు లేకపోవడంతో వెనుదిరగాల్సి వస్తోంది. మండల పరిధిలోని పడిదెంపాడు గ్రామ సచివాలయంలో ఉద్యోగులు బుధవారం ఉదయం 11 గంటలైనా సచివాలయానికి ఒక్కరు కూడా రాలేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అంతా వారి ఇష్టారాజ్యమైందని గ్రామస్తులు మండిపడుతున్నారు.

గుడ్డిగా నమ్మితే..అంతే..!

- యువతకు రుణం పేరిట గాలం వేస్తున్న యాప్‌ల నిర్వాహకులు
- ష్యూరిటీ లేకుండానే అకౌంట్‌లో నగదు క్రెడిట్
- ఆపై తీసుకున్న నగదు కంటే అధిక మొత్తం కట్టాలంటూ ఒత్తిడి
- సకాలంలో చెల్లించకపోతే బ్లాక్‌మెయిల్‌కు దిగుతున్న నిర్వాహకులు
- ఒత్తిడితో ఆత్మహత్యలకు పాల్పడుతున్న యువత
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

గడివేములకు చెందిన ఓ వ్యాపారి కుమారుడు లోన్ యాప్ ద్వారా లోను తీసుకున్నాడు. అతను సక్రమంగా చెల్లించకపోవడంతో యాప్ నిర్వాహకులు గ్రామంలో ఉన్న ప్రజాప్రతినిధికి ఫోన్‌లు చేసి మీరు ష్యూరిటీ పెట్టారు, అందుకు మీరు చెల్లించడని వేధించారు. విసిగిపోయిన ఆయన మీ మీద పోలీసులకు ఫిర్యాదు చేస్తాను.. అని గట్టిగా చెప్పడంతో అప్పటి నుంచి ఫోన్ కాల్స్ రావడం లేదు. ఇలాంటి బాధితులు గ్రామాల్లో ఎంతో మంది ఉన్నారు. బయటకు చెప్పుకోలేక కుమిలిపోతున్నారు.



గడివేముల: పెరుగుతున్న టెక్నాలజీని కొందరు కేటుగాళ్లు ఉపయోగించుకుంటూ అమాయకులకు గాలం వేస్తున్నారు. ష్యూరిటీ లేకుండానే రుణం అని చెప్పి ఆకర్షిస్తున్నారు. అలా ప్రైవేట్ యాప్‌ల ద్వారా రుణం తీసుకున్న తరువాత అసలు కథ మొదలవుతుంది. తీసుకున్న నగదు కంటే వడ్డీకి వడ్డీ వేసి అధిక మొత్తం కట్టాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. లేదంటే నగ్న వీడియోలు పెడ తామని బ్లాక్ మెయిల్‌కు దిగుతారు. వారి టార్చర్ తట్టుకోలేక కొందరు లోలోపలే కుంగిపోతుంటే .. మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రైవేట్ యాప్‌లో రుణాలు తీసుకుని మోసపోవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

మండలంలో అనేక మంది బాధితులు

మీ మొబైల్ ఫోన్‌లో ఒకే ఒక క్లిక్‌తో యాప్ డౌన్లోడ్ చేసుకోండి. హామీ లేకుండా రుణం పొందండంటూ రుణ యాప్ నిర్వాహకులు ఇచ్చే ప్రకటనలకు కొందరు ఆకర్షితులవుతున్నారు. ఇదే వారి పాలిట శాపంగా మారుతోంది. ఒక్కసారి యాప్ వలలో చిక్కితే బయటపడడం అసాధ్యం. ఇలా యాప్ బారిన పడిన మండలంలో అనేక మంది బాధితులు బయటకు చెప్పుకోలేక మదన పడుతున్నారు. లోన్ యాప్స్ నిర్వాహకుల వలలో పడి అవస్థలు పడుతున్నారు. మీరు రుణం తీసుకోవడానికి ఎంపికయ్యారంటూ ఫోన్లు చేసి యువతకు వల వేస్తున్నారు. చూద్దామని చెబితే చాలు.. రుణం తీసుకునే వరకూ ఫోన్ చేసి, ఏదో విధంగా ఒప్పించి రుణం తీసుకునేలా చేస్తారు. తీరా లోన్ యాప్ ద్వారా రుణం తీసుకుంటే, వడ్డీకి వడ్డీ వేసి, రుణం సొమ్ము నుంచే ముందుగానే కొంత మినహాయించి ఇస్తారు. ఇలా మండలంలో చాలామంది బాధితులు లోన్ యాప్ నిర్వాహకుల చేతిలో మోసపోయి ఎవరికీ చెప్పుకోలేక ఆందోళన చెందుతున్నారు.

వేధింపులు ఇలా..

రుణం తీసుకున్న రోజు నుంచే చెలింపుల కోసం నిర్వాహకులు తీవ్రంగా ఒత్తిడి చేస్తారు. చెల్లింపులు ఆలస్యమయ్యే కొద్దీ వేధింపులు మరింత తీవ్రతరమవుతాయి. రుణ గ్రహీత మొబైల్‌కు పరువు, ప్రతిష్టకు భంగం కలిగించే పోస్టులతో దుష్ప్రచారాలతో కూడిన సందేశాలు, అభ్యంతరకర ఫొటోలు పంపుతారు. బెదిరింపులను లెక్క చేయకపోతే రుణం తీసుకున్న వారి కుటుంబసభ్యుల ఫొటోలను మార్ఫింగ్ చేసి రుణం పొందిన వారి సెల్‌ఫోన్‌లోని కాంటాక్టు నంబర్లకు వాట్సాప్‌కు పంపుతారు. వీరి ఆగడాలను కొందరు బయట చెప్పుకోలేక నలిగిపోతున్నారు. కొందరు యువకులు రుణం తీర్చడానికి కుటుంబ సభ్యులను మోసం చేయడం, చోరీలకు సైతం పాల్పడడం జరుగుతున్నాయి. ముఖ్యంగా యాప్ల నిర్వాహకులు గ్రామీణ ప్రాంతాలపైనే కన్నేశారు.

అప్రమత్తంగా ఉండాలి



స్మార్ట్‌ఫోన్‌లో మనకు తెలియని యాప్‌లు కనిపిస్తే వాటి జోలికి వెళ్లవద్దు. అదే విధంగా తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీలు చెప్పమని అడిగినా.. అపరిచిత వ్యక్తుల ఫోన్లకు సమాధానం ఇవ్వకండి. ప్రతి యాప్‌ను క్లిక్ చేయకూడదు. క్లిక్ చేశారంటే ఇబ్బందులను కొని తెచ్చుకున్నట్లే. రుణయాప్‌లో అప్పులు తీసుకుని మోసపోవద్దు. హామీ లేకుండా రుణాలు వస్తున్నాయని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆశ పడవద్దు. రుణాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. రుణ యాప్ నిర్వాహకుల నుంచి వేధింపులు ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయండి.

– సీసీ నాగార్జునరెడ్డి, ఎస్‌ఐ, గడివేముల

రోడ్డు ప్రమాదంలో పెళ్లి బృందానికి గాయాలు

కల్లూరు: 44 జాతీయ రహదారి పెద్దటేకూరు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పెళ్లిబృందానికి గాయ్యాలయ్యాయి. చిన్నటేకూరు గ్రామానికి చెందిన పెళ్లి బృందం (వధువు తరఫువారు) పెద్దటేకూరులో వరుడి ఇంటి వద్ద జరిగే వివాహ కార్యక్రమానికి ట్రాక్టర్‌లో బయలు దేరారు. పెద్దటేకూరు దగ్గర సర్వీసు రోడ్డులో వెళ్లాల్సి ఉండగా.. మరిచిపోయి బ్రిడ్జిపై ముందుకెళ్లి రివర్స్ వచ్చి సర్వీస్ రోడ్డులో పోవడానికి ప్రయత్నిస్తుండగా పెళ్లి బృందం ప్రయాణిస్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న 12 మంది స్వల్ప గాయాలకు గురికాగా, ముగ్గురికి తీవ్రగాయ్యాలయ్యాయి. విషయం తెలుసుకున్న వెంటనే నేషనల్ హైవే పెట్రోలింగ్ వాహనంలో హెడ్ కానిస్టేబుల్ నూర్ అహమ్మద్, మొబైల్ సిబ్బంది గాయపడిన వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అదే సమయంలో చిన్నటేకూరు క్యాంపస్ నుంచి కర్నూలు వైపు వెళ్తున్న అశోకా మహిళ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అశోక్‌వర్ధన్ రెడ్డి, చిన్నటేకూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గాయపడిన వారిని తన కార్లలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుద్ద వాగుకు రక్షణగోడ నిర్మించాలి



గణేష్ నగర్‌లో పొంగి ప్రవహిస్తున్న సుద్దవాగును చూపిస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కర్నూలు నగరంలోని 22, 23, 24వ వార్డుల పరిధిలో ఉన్న సుద్దవాగుకు రక్షణ గోడ నిర్మించాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు నరసింహులు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు శ్రీరామ్‌నగర్, లక్ష్మీ నగర్‌లలో పర్యటించారు. మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా సుద్ద వాగు పొంగి పొర్లి ఆ కాలనీలు జలమయమయ్యాన్నారు. నరసింహులు మాట్లాడుతూ వాగుకు రక్షణ గోడ లేకపోవడంతో గణేష్ నగర్ నుంచి కేసీ కెనాల్ వెంట వెళ్లే వాహనాదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాగు పొంగిన ప్రతిసారి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, విధులకు వెళ్లే ఉద్యోగులు సుద్ద వాగును దాటేందుకు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లవసిన పరిస్థితి ఉందన్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి రాజకీయ నాయకులు మేము గెలిస్తే సుద్ద వాగుకు రక్షణ గోడను నిర్మిస్తామని హామీలు గుప్పిస్తున్నారు తప్ప గోడ నిర్మించడం లేదన్నారు. కార్యక్రమంలో అజ్మిత్, శేఖర్, రాజు, అయ్యస్వామి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవం ముసుగులో జన్మదిన వేడుకలు

ఓర్వకల్లు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద ప్రజలను ప్రలోభాలకు గురిచేయడమే గాక, అధికారులను సైతం వదిలిపెట్టడం లేదు. బుధవారం హుసేనాపురం గ్రామంలో నూతన సీసీ రోడ్ల ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామానికి చెందిన టీడీపీ నాయకుని జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే గౌరు చరితా హాజరుకావడం చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా ఈ సభను మండల కేంద్రంలో నిర్వహించాల్సివుండగా.. హుసేనాపురం గ్రామంలో నిర్వహించాల్సిన అవసరం ఏముందని? స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కార్యక్రమానికి ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్, పంచాయతీరాజ్ ఏఈ సురేంద్రనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు, వ్యవసాయాధికారిణి మధుమతి తమ షెడ్యూళ్లను పక్కన బెట్టి హాజరు కావడం తప్పడంలేదు. కానీ ప్రభుత్వ కార్యక్రమాలను అడ్డుపెట్టుకొని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టీటీడీ పాలక మండలి సభ్యులు మల్లెల రాజశేఖర్ పుట్టిన రోజు వేడుకలకు హాజరుకావాలని హుకుం జారీచేసినట్లు తెలుస్తోంది.

ఆటో కార్మికుల పొట్ట కొట్టొద్దు



డీటీ హరికృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

గడివేముల: ఉచిత బస్సుతో ఆటో కార్మికుల పొట్ట కొట్టవద్దని సీఐటీయూ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రమైన గడివేముల పాతబస్టాండు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం రవాణా సంస్థకు చెందిన జీఓ 21 వెంటనే రద్దు చేయాలన్నారు. చలానాల ద్వారా ఆటో కార్మికులకు భారంగా మారిందన్నారు. ఈ నెల 15 నుంచి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం ద్వారా ఆటో కార్మికులు రోడ్డునపడే అవకాశం ఉందన్నారు. ఆటో కార్మికులను ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గోకార్‌సా, రాజు, చంద్ర, బాలు తదితరులు పాల్గొన్నారు.

మోటారు అమర్చారు.. కనెక్షన్ మరిచారు



కుళాయి పైపులైన్లకు కనెక్షన్ ఇవ్వకపోవడంతో బోరు వద్ద వృథాగా పారుతున్న తాగునీరు

కోడుమూరు రూరల్ : మండలంలోని కొత్తపల్లె గ్రామంలో తాగునీటి బోర్లు చెడిపోవడంతో గ్రామంలో తీవ్ర నీటిఎద్దడి తలెత్తింది. గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులపై ఈనెల 8వ తేదీన ‘సాక్షి’ దినపత్రికలో ‘వానాకాలంలోనూ ఎండుతున్న గొంతులు’ అన్న శీర్షికన కథనం ప్రచురితం కావడంతో స్పందించిన అధికారులు హుటాహుటిన తాగునీటి బోర్ల మరమ్మతులకు చర్యలు తీసుకున్నారు. ఇందులో ఒక బోరుకు సంబంధించిన మోటారు రిపేరు చేసి నీళ్లు పారిస్తున్నప్పటికీ, ఆ బోరు నుంచి గ్రామంలోకి వెళ్లే కుళాయి పైపులకు కనెక్షన్ ఇవ్వకుండా వదిలేశారు. బోరును రిపేర్ చేసినప్పటికీ పైపులైన్‌కు కనెక్షన్ ఇవ్వకపోవడంతో ప్రజలకు ఉపయోగపడకుండా నీరంతా వృథాగా పారిపోతుంది. ఇకనైనా అధికారులు స్పందించి బోరు నుంచి గ్రామంలోకి నీళ్లు వెళ్లే పైపులైన్‌కు కనెక్షన్ ఇచ్చి కుళాయిలకు నీళ్లు పారేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

21న మహిళల రగ్బీ పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక ఆదర్శ విద్యా మందిర్ క్రీడా ప్రాంగణంలో ఈనెల 21న ఖేలో ఇండియా మహిళల రగ్బీ పోటీలు నిర్వహించనున్నట్లు రగ్బీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, గుడిపల్లె సురేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, రగ్బీ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో అండర్–15 విభాగంలో బాలికలకు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

స్వాతంత్య్ర యోధుల చిత్ర ప్రదర్శన



ప్రదర్శనను ప్రారంభిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: స్వాతంత్య్ర సమరయోధుల వీర గాథలు భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని ప్రముఖ న్యూరో సైక్రియాట్రిస్ట్ డాక్టర్ కంచర్ల హరిప్రసాద్ అన్నారు. బుధవారం పాతబస్తీలోని గడ్డ వీధి షంషియా మదరసాలో ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహ్మద్ సేకరించిన ముస్లిం స్వాతంత్య్ర సమరయోధుల చిత్రాల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో ముస్లిం నేతలు ప్రాణాలు తెగించి పోరాడారన్నారు. టిప్పు సుల్తాన్ మొదలుకొని గులాం రసూల్ ఖాన్ వరకు వేలాది మంది ముస్లింలు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడి అమరులయ్యారని వివరించారు. షంషియ మదరసా మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు షేక్ మౌలానా అబ్దుల్ జబ్బార్ మాట్లాడుతూ.. స్థానిక చరిత్ర పరిశోధకుడు నశీర్ అహ్మద్ దేశమంతా తిరిగి ముస్లిం స్వాతంత్య్ర సమరయోధుల చరిత్రను సేకరించి చరితార్థులు అనే గ్రంథాన్ని రచించారన్నారు. ఆ గ్రంథాల నుంచి గ్రహించిన 154 మంది ముస్లిం మహిళ, పురుష స్వాతంత్య్ర సమరయోధుల చిత్ర పటాలతో ప్రదర్శను ఏర్పాటు చేశామన్నారు. ప్రముఖ కథా రచయిత ఇనాయతుల్లా, నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్ మాట్లాడారు. కమిటీ కార్యదర్శి ఖదీరుల్లా, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు దరఖాస్తు చేసుకోండి

సి.బెళగల్: మండలంలో అన్నదాత సుఖీభవకు అర్హులై నగదు జమకాని రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్ కుమార్ సూచించారు. బుధవారం ఆయన మండల పరిధిలోని బురాన్‌దొడ్డి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో రైతులు సాగు చేసిన కంది, పత్తి పంటలను పరిశీలించి వారితో మాట్లాడారు. అనంతరం స్థానిక రైతు సేవ కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. అర్హులై రైతులకు బ్యాంక్ సమస్యలతో అన్నదాత సుఖీభవ నగదు జమ కాని రైతులు ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ హిమబిందు, వీఏఏలు సాయితేజ గౌడ్ ఉమాదేవి, ఎంపీఈఓ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

139 పింఛన్ల తొలగింపు

గడివేముల: మండల పరిధిలోని గ్రామాల్లో 139 వివిధ రకాల పింఛన్లను తొలగించినట్లు ఎంపీడీఓ వాసుదేవగుప్తా తెలిపారు. బుధవారం ఎంపీడీఓ మాట్లాడుతూ వికలాంగులు, మానసిక రోగులకు సంబంధించిన లబ్ధిదారులకు సర్టిఫికెట్లు సరిగా లేనందున పింఛన్లు తొలగించినట్లు వివరించారు. మండలంలో వికలాంగ, మానసిక రోగులు తదితరులు 407 మంది ఉన్నారు. అందులో సర్టిఫికెట్లు సరిగా ఉన్న వారు 268 మాత్రమే ఉన్నారన్నారు. బిలకల గూడూరు 15, బూజునూరు 6, చిందుకూరు 14, దుర్వేశి 20, గడిగరేవుల 10, గడివేముల 20, గని 11, కరిమద్దెల 8, కొరటమద్ది 7, కొర్రపోలూరు 10, మంచాలకట్ట 8, ఒండుట్ల 7, పెసరవాయిలో 10 పింఛన్లను తొలగించడం జరిగిందని ఎంపీడీఓ వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కొత్త పింఛన్లు మంజూరు చేయకుండా ఉన్న పింఛన్లను కూడా తొలగించడం అన్యాయమని బాధితులు ఆరోపిస్తున్నారు.

నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు(రూరల్): తుంగభద్ర నదికి భారీగా నీరు విడుదలవుతున్న క్రమంలో నదీతీరంలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు రూరల్ తహసీల్దార్ రమేష్ బాబు సుచించారు. నదికి దాదాపు 60 వేల క్యూసెకుల నీరు వస్తోందని, తీరంలోని సుంకేసుల, ఆర్.కె.దుద్యాల, ఎదురూరు, ఆర్.కొంతలపాడు, జి.సింగవరం, నిడ్జురు, పంచలింగాల, ఈ.తాండ్రపాడు, గొందిపర్ల, దేవమాడ, పడిదెంపాడు, పూడూరు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నది వైపు వెళ్లారాదని, చేపల వేటకు, బట్టలు శుభ్రపరిచెందుకు, స్నానాలు కోసం నదిలోకి దిగరాదని గ్రామాల్లో దండోరా వేయించారు. అలాగే ప్రార్థనా మందిరాల్లో గ్రామ పెద్దలతో అవగాహన కల్పించారు.

రెగ్యులర్ వీసీని నియమించాలి

కర్నూలు(సెంట్రల్): క్లస్టర్ యూనివర్సిటీకి రెగ్యులర్ వైస్‌చాన్స్‌లర్‌ను నియమించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప విమర్శించారు. బుధవారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సిల్వర్ జూబ్లీ, కేవీఆర్, ఫర్ మెన్ డిగ్రీ కళాశాలలకు అనుబంధంగా క్లస్టర్ యూనివర్సిటీ యాక్ట్–2020 ప్రకారం వీసీ, రిజిస్ట్రార్ పోస్టులు తప్ప ఏ ఒక్క పోస్టును భర్తీ చేయలేదన్నారు. జగన్నాథగట్టుపై నిర్మిస్తున్న భవనాలు అసంపూర్తిగానే మిగిలాయని, వాటిని పూర్తి చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. తక్షణమే భవనాలను పూర్తి చేయాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేసి సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను అందుబాటులోకి తేవాలని కోరారు. క్లస్టర్ వర్సిటీని మూసి వేస్తున్నారని వస్తున్న వార్తలపై విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించాలని, లేనిపక్షంలో పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అమర్, యోగి, మనోహర్, చిన్న పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

కర్నూలు (టౌన్): రక్తదానం ప్రాణదానంతో సమానమని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష అన్నారు. బుధవారం బిర్లా కాంపౌండ్‌లోని కార్యాలయ ఆవరణలో తలసేమియా వ్యాధిగ్రస్తులకు మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయన స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం మానవత్వ ధర్మమన్నారు. యువత అపోహాలు వీడి రక్తదానం చేయాలన్నారు. రక్తదానంతో ప్రాణదాతలుగా సమాజంలో ఆదర్శంగా నిలవాలన్నారు. రెండవ పట్టణ సీఐ నాగరాజు మాట్లాడుతూ.. సామాజిక సేవ కార్యక్రమాల్లో యువత ముందుండాలన్నారు.

బైన్‌దొడ్డిలో పత్తి పొలంలో నిలిచిన వాననీరు



వర్షం.. పత్తి రైతుకు నష్టం



ఉల్చాల గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంట

కోడుమూరు రూరల్ : ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతులను వరుణదేవుడు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాడు. మొన్నటి వరకు వానల్లేక పంటలు ఎండిపోయే స్థితి చేరుకోగా.. గత 10రోజుల నుంచి వరుసగా కురుస్తున్న వర్షాల వల్ల ఖరీఫ్ కింద సాగు చేసిన పత్తి పంట తీవ్రంగా దెబ్బతింటోంది. ఈ ఏడాది ఖరీఫ్ కింద కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల్లో 7,500కు పైగా హెక్టార్లలో రైతులు పత్తి పంట సాగు చేశారు. ప్రస్తుతం పత్తి పంట పూత, కాయ దశలో ఉంది. ఈ దశలో వానలు అధికంగా కురుస్తుండడంతో పత్తి మొక్కలకు పట్టిన పూతంతా రాలిపోతుండగా, పగులుతున్న పత్తి కాయల్లోకి నీళ్లు చేరి కుళ్లిపోతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మరికొన్ని గ్రామాల్లో పంట పొలంలో వాననీటి నిల్వతో పత్తి మొక్కలు ఎర్రగా మారిపోయి దెబ్బతింటున్నాయి. వర్షాభావ పరిస్థితుల వల్ల అంతంత మాత్రంగా ఉన్న పత్తి పంట వరుసగా కురుస్తున్న అధిక వర్షావల్ల దెబ్బతింటుండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

వీడని వర్షం

కర్నూలు(రూరల్): వర్షం వీడటం లేదు.. రెండు రోజులుగా కూరుస్తూనే ఉంది. వర్షపు నీటిలో పైర్లు మునిగిపోవడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి జి.సింగవరం, ఉల్చాల, రేమట, బసాపురం గ్రామాల్లో పత్తి, మొక్కజొన్న పంటలు నీటమునిగాయి.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



చిప్పరాస్ కాలనీలోని కుటుంబాలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకలు

కర్నూలు(రూరల్): మండల పరిధి గొందిపర్ల గ్రామంలో చిప్పరాస్ ప్రభుత్వ స్థలంలో కొట్టాలు వేసుకున్న పేదలకు ఇంటి పట్టాలు అందజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలోని చిప్పరాస్ ప్రభుత్వ స్థలం సర్వే నంబర్ 106లో కొట్టాలు వేసుకొని జీవనం సాగిస్తున్న కుటుంబాలను సీపీఎం నాయకులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. దాదాపుగా 100 కుటుంబాలు 40 ఏళ్ల నుంచి కొట్టాలు వేసుకొని నివాసం ఉంటున్నాయన్నారు. వీరికి రేషన్ కార్డులు, కరెంట్ మీటర్లు కూడా గతంలో మంజూరు చేశారని చెప్పారు. కానీ ఇంటి పట్టాలు అందజేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే వీరికి ఇంటి పట్టాలు అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాలపీరా, రాఘవేంద్ర, శ్రీరాములు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో భవిష్యత్తు అంధకారం



మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

కర్నూలు: గంజాయి, డ్రగ్స్, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జీవితం నాశనమవుతుందని, వాటికి దూరంగా ఉంటూ విద్యార్థులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కర్నూలు ఎక్సైజ్ నోడల్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి సూచించారు. ‘నషా ముక్త్ భారత్ అభియాన్’ కార్యక్రమంలో భాగంగా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో టౌన్ మోడల్ జూనియర్ కళాశాల, ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, మనిషి ఆరోగ్యం పై చూపే దుష్ప్రభావాలను వివరించారు. డ్రగ్స్‌కు బానిసలైన వారు తారసపడితే సమాచారం అందించాలన్నారు. విద్యార్థుల చేత డ్రగ్స్‌కు దూరంగా ఉంటామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, జిల్లా అధికారులు సుధీర్ బాబు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఔట్లను క్రమబద్ధీకరించుకోండి



మాట్లాడుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు (టౌన్): అనధికార లేఔట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య సూచించారు. బుధవారం స్థానిక నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో ఎల్ఆర్ఎస్ పథకంపై లైసెన్స్‌డ్ ఇంజినీర్లతో కలిసి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. అనధికారిక లేఔట్ల క్రమబద్ధీకరణ పథకంలో కొన్ని సవరణలు చేస్తూ ప్రభుత్వం జీఓ నంబర్ 134 జారీ చేసిందన్నారు. ఈ ఏడాది జూన్‌కు ముందు ఏర్పాటైన అనధికార లేఔట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందన్నారు. వచ్చే అక్టోబర్ 24వ తేదీలోపు రూ.10 వేలు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది తనిఖీ చేసి ధ్రువీకరించిన తరువాత మార్కెట్ విలువలో 14 శాతం అపరాధ రుసుం చెల్లించి ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. 45 రోజుల్లోపు పూర్తి రుసుం చెల్లించిన వారికి 10 శాతం రాయితీ, 45 నుంచి 90 రోజుల వ్యవధిలో చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ఉంటుందన్నారు. గడువులోపు క్రమబద్ధీకరించుకోని అనధికారిక లేఔట్లు, ప్లాట్లకు విద్యుత్ సౌకర్యం, నీటి సరఫరా, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఆర్‌డీటీటీపీ సంజీవ్‌కుమార్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.